

అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. జిల్లా నలమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అన్నదాన కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి తదితరుల పాల్గొన్నారు.

● ఆంధ్రజ్యోతి, ఆత్మకూరు

పునరుజ్జీవం!
ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ



హంద్రీనీవా ప్రధాన కాలువలో నీటి గలగలలు

- హెచ్చెల్సీ, హంద్రీనీవా అభివృద్ధికి రూ.కోట్ల నిధులు
- ఎన్నికలతో సాగునీటి సంఘాలకు జవసత్వాలు
- ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడానికి కూటమి సర్కారు యత్నం
- వైసీపీ పాలనలో కుదేలైన సాగునీటి రంగం

విద్యాశాఖలో డివిజనల్ స్థాయి అధికారి చేతివాటం

ఫిర్యాదులొస్తే... పండగే..!

- యథేచ్ఛగా వసూళ్లు
- లోపాలు చూపడం.. ఆఫీస్ చుట్టూ తిప్పడం

అనంతపురం విద్య, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్కూళ్లపై ఆయనకు ఫిర్యాదులొస్తే పండగే. ఎన్ని ఫిర్యాదులొస్తే...అన్ని డబ్బులు. అది ప్రభుత్వ పాఠశాల అయినా... ప్రైవేట్ స్కూల్ అయినా.. వెళ్లిన చోట ఆయన తనదైన ముద్ర వేసొస్తాడు. ముఖ్యంగా ప్రైవేట్ స్కూళ్లకు వెళితే లోపాలు వెదుకుతాడు. గోడ నెర్రెలు ఇచ్చినా ఆయనకు నచ్చదు. వెంటనే ఆ పేపర్లు తీసుకురండి.. ఈ రికార్డులు ఇవ్వండి అంటూ ఆదేశిస్తాడు. ఇలా ఒకసారి కాదు... కార్యాలయం చుట్టూ పదే పదే తిప్పిస్తాడు. ఇవన్నీ విన్నవాళ్లు సార్.. బాగా స్ట్రిక్ట్ అనుకుంటారు. తర్వాత అసలు రూపం బయటపెడతాడు. మామూళ్లు పిండటం మొదలు పెడతాడు. ప్రైవేట్ స్కూళ్ల నుంచి రూ. 40 వేలు, రూ. 60 వేలు, ఆఖరికి లక్ష. ఏ స్కూల్‌పై ఫిర్యాదులు వచ్చినా, సమస్యలు తన దృష్టికి వచ్చినా చర్యలు ఉండవు. విచారణకు వెళ్తాడు.. ఆ తర్వాత నోటు పాలసీతో ముందుకెళ్తుంటాడు. ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కడికెళ్లినా తన మార్క్ చూపుతాడు.



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం (ఫైల్)

జిల్లా విద్యాశాఖలోని డివిజన్ స్థాయి అధికారి ప్రైవేట్ స్కూళ్ల నుంచి భారీగానే గుంజుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. స్కూళ్ల అనుమతులు, గుర్తింపు రెన్యూవల్, విచారణలు ఇలా ఏదైనా ఆ అధికారికి కాసుల పంటే. ఇటీవల అనంతపురం పాతూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు గుర్తింపు రెన్యూవల్ కోసం రూ. 40 వేలు లాగేశారట. నగరంలోని జీసస్ నగర్‌లో ఉన్న మరో ప్రైవేట్ స్కూల్ నుంచి సైతం రూ. 2.50 లక్షల వరకూ మామూళ్లు లాగేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వడియంపేట వద్ద ఈ ఏడాది కొత్తగా ప్రారంభించిన ఓ ప్రముఖ కార్పొరేట్ స్కూల్‌కు సైతం అనుమతుల విషయంలో బాగా అడ్డుపడ్డారని ఆరోపణలున్నాయి. సుమారు నాలుగు నెలలు వేధించారని తెలుస్తోంది. దీంతో వారు కడప ఆర్‌జేడీ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తెచ్చుకున్నట్లు తెలిసింది. ఇక చేసేది లేక... అందినకాడికి ముడుపులు తీసుకుని సరిపెట్టుకున్నారట. వచ్చిన ఏడాదిన్నరలోనే ఆయన భారీగానే దండుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

స్కూళ్ల నుంచి భారీ వసూళ్లు..

ఉత్తుత్తి విచారణలు

ఆయన ఏ విచారణ చేసినా ముగింపు పలకడు. విద్యా సంవత్సరం ప్రారంభ సమయంలో పలు స్కూళ్లలో లోపాలపై విద్యార్థి సంఘాల నేతలు ఫిర్యాదు చేశారు. సుమారు 15 నుంచి 20 స్కూళ్లలోని సమస్యలను, అక్రమాలను అప్పటి మహిళా డీఈఓ దృష్టికి తీసుకెళ్లగా.. విచారణ చేయాలని సదరు డివిజన్ స్థాయి అధికారిని ఆమె ఆదేశించారు. విచారణకు వెళ్లిన ఆయన స్కూళ్లల్లో బుక్స్, యూనిఫామ్స్ గదులను సీజ్ చేసి వెంటనే మళ్లీ వాటిని ఓపెన్ చేసుకోడానికి అనుమతులు ఇవ్వడంపై అనేక విమర్శలు వచ్చాయి. స్కూళ్ల నుంచి డబ్బులు తీసుకుని తర్వాత అనుమతులిస్తాడన్న విమర్శలు ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలంలోని ఓ



టీచర్, యూనియన్ నాయకుడిపై ఆరు మాసాల వ్యవధిలోనే రెండుసార్లు విచారణ చేశాడు. ఇంకా ఏమీ తేల్చకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా విద్యాశాఖలో డీఈఓలు తరచూ మారడం ఆయనకు కలిసొచ్చింది. ఇప్పటికే ఆయనపై ప్రైవేట్ స్కూళ్ల యూనియన్ నాయకులు, కరస్పాండెంట్లు సైతం గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. త్వరలో వారంతా విద్యాశాఖ కమిషనర్‌ను సైతం కలసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

సహకార సంఘాల సభ్యుల ఈకేవైసీకి స్పెషల్ డ్రైవ్

ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సహకారసంఘాల సభ్యుల ఈకేవైసీని చేపట్టడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్రస్థాయి నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కేంద్రప్రాయోజిత పథకమైన పీఏసీఎస్ కంప్యూటరైజేషన్‌లో భాగంగా రికార్డులలో ఈకేవైసీ వివరాలను నవీకరించడానికి మిషన్‌మోడ్‌లో డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. కంప్యూటరైజేషన్‌లో భాగంగా సహకారసంఘాల సభ్యులు తప్పకుండా ఈకేవైసీని చేయించుకునేలా చూడాలని ఉత్తర్వులు వచ్చాయన్నారు. అన్నిసహకారసంఘాల సభ్యులు సంబంధిత సచివాలయాల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకుని సమాచారం ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో సహకార సంఘాలనుంచి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ప్రభుత్వం ఈకార్యక్రమం చేపట్టిందన్నారు. జనవరి1 తర్వాత ఈకేవైసీ లేకపోతే సభ్యులు ఎలాంటి లావాదేవీలు చేయలేరన్నారు. ఈకేవైసీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని డీసీఓ అరుణకుమారిని ఆయన ఆదేశించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక

అనంతపురం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక సోమవారం కలెక్టరేట్‌లో కొనసాగుతుందని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంట నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొరుగు మద్యంపై తగ్గని మోజు!

ఏపీలో చౌకగా ఉన్నా కర్ణాటకకే పరుగులు
వెంటాడుతున్న జగన్ బ్రాండ్ల ప్రభావం



డి.హీరేహాళ్‌లోని మద్యం దుకాణం

మందుబాబులు గత ప్రభుత్వ దెబ్బ నుంచి ఇంకా కోలుకోలేకపోతున్నారు. గతంలో జే బ్రాండ్ల దెబ్బకు భయపడి కర్ణాటక మద్యానికి అలవాటు పడిన మద్యం ప్రియులు.. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాణ్యమైన సరుకును సరఫరా చేస్తున్నా నమ్మలేక పోతున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని మద్యం ప్రియులు అటువైపు మద్యానికే మొగ్గుచూపుతున్నారు.

డి.హీరేహాళ్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నాసిరకమైన జే బ్రాండ్లతో మద్యాన్ని విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడింది. ఈ ఐదేళ్లూ మద్యం ప్రియులు నాణ్యమైన మద్యం లభించక నరకయాతనలు అనుభవించారు. దీనిని గ్రహించిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ తీసుకువచ్చి తక్కువ ధరలోనే నాణ్యమైన మద్యాన్ని అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొన్ని నెలల్లోనే నూతన మద్యం పాలసీని తీసుకువచ్చారు. ఇతర రాష్ట్రాల్లో లభించే అన్ని మద్యం బ్రాండ్లను అందుబాటులో ఉంచారు. ఇతర రాష్ట్రాల కన్నా తక్కువ ధరలకే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులో ఉంచారు. అయినా మద్యం ప్రియులు కర్ణాటక మద్యానికే మక్కువ చూపుతున్నారు. గత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో ఇష్టానుసారంగా నకిలీ బ్రాండ్లతో మద్యాన్ని విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. దీంతో ఆ మద్యానికి భయపడిన మద్యం ప్రియులు నేడు ఆంధ్రాలో ప్రవేశపెట్టిన నాణ్యమైన మద్యాన్ని నమ్మలేకపోతున్నారు. దీంతో పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మద్యానికి మంచి డిమాండ్ ఉంది. దీనికి తోడు అప్పటి నుంచి కర్ణాటక మద్యానికి అలవాటు పడిన వారు దానిని వదలలేకపోతున్నారు. ముఖ్యంగా రోజూవారి కూలీలు కర్ణాటక మద్యానికి ఎక్కువ అలవాటుపడ్డారు. కర్ణాటకలో 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్ రూ. 40 కే లభిస్తుంది. అందుకే రూ. 200 కూలి లభించే చాలా మంది కర్ణాటక మద్యానికి పరుగులు తీస్తున్నారు. దీనికి తోడు డి.హీరేహాళ్ మండలం కర్ణాటకకు సరిహద్దు ప్రాంతమైనందున మండలం చుట్టూ ఒక కి.మీ. దూరంలోనే కర్ణాటక ప్రాంతం కలిగి ఉంది. ఈ ప్రాంతంలో చాలా చోట్ల కర్ణాటకకు మద్యం దుకాణాలు ఉన్నాయి. దీంతో కర్ణాటక మద్యం సులభంగా లభిస్తుంది. సరిహద్దులో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలకు మంచి డిమాండ్ ఉంది. మండలం మొత్తానికి సంబంధించి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి వ్యాపారం అంతంతగానే కనిపిస్తోంది.



వ్యాపారం జరగడం లేదు : మురళి, మద్యం దుకాణం నిర్వాహకుడు

వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు బోగస్ కంపెనీల ద్వారా నాసిరకమైన మద్యాన్ని ప్రవేశపెట్టారు. ఆ ప్రభావం ఇప్పటికీ వెంటాడుతోంది. దీంతో ప్రస్తుతం తక్కువ ధరలో లభించే నాణ్యమైన మద్యాన్ని కూడా నమ్మలేకపోతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే.. రోజుకు వేల రూపాయలలో కూడా వ్యాపారాలు జరగడం లేదు. ఈ ప్రాంతం కర్ణాటకకు సరిహద్దులో ఉండడంతో చాలా మంది అక్కడికి వెళుతున్నారు. దీంతో మాకు వ్యాపారాలు జరగక ఇబ్బంది పడుతున్నాం.

కర్ణాటక మద్యం విక్రయాలపై చర్యలు : గురుప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ



కర్ణాటక మద్యం విక్రయాలపై ప్రతినిత్యం మండల వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నాం. వాహనాలలో అక్రమ మద్యం తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నాం. డి.హీరేహాళ్ మండలం కర్ణాటకకు ఆనుకొని ఉండడంతో చాలామంది దగ్గర్లోనే ఉన్న అక్కడి మద్యం దుకాణాలకు వెళ్లి వస్తున్నారు. అలా వెళ్లి తిరిగి కర్ణాటక మద్యం తీసుకువస్తున్నారన్న సమాచారంతో కూడా వాహనాల తనిఖీలు చేపడుతున్నాం.

విద్యాశాఖ సర్వీసెస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

అనంతపురం విద్య, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ సర్వీసెస్ అసోసియేషన్ అనంతపురం జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారులు, రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్యాంకుమార్, సహాధ్యక్షుడిగా పార్థసారధి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి(ఉమెన్)గా దుర్గ, జిల్లా ఉపాధ్యక్షులుగా ఇక్బాల్, అనిల్‌కుమార్ నాయక్, చక్రధర్, పవన్, చెన్నకేశవులు, కార్యనిర్వాహక కార్యదర్శిగా సురేష్ నాయక్, సంయుక్త కార్యదర్శులుగా హాజీవలీ, నాగరాజు, రమేష్, బాలకృష్ణ, కోశాధికారిగా వంశీబాబు, కార్యనిర్వాహక సభ్యులుగా శివప్రసాద్, శ్రీనివాసులు, రామాంజనేయులు, ఇలియాజ్‌ను ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గానికి ఇతర సభ్యులు, నాయకులు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

అపుస్మా రాష్ట్ర కమిటీలోకి ముగ్గురు జిల్లా వాసులు



ఎంపికైన జిల్లా నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మా) రాష్ట్ర కమిటీలోకి జిల్లా నుంచి ముగ్గురు నాయకులకు చోటు కల్పించారు. ఆదివారం గుంటూరులో అపుస్మా సర్వసభ్యసమావేశం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్‌గా పుల్లారెడ్డిని, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన బాబును, రాష్ట్ర లీగల్ అడ్వైజర్‌గా గుంతకల్లుకు చెందిన నాగార్జునను ఎంపిక చేశారు. జిల్లా నుంచి ముగ్గురు నాయకులకు రాష్ట్ర కమిటీలోకి చోటు దక్కడంతో యూనియన్ జిల్లా నేతలు వారికి అభినందనలు తెలిపారు.

న్యాయవాది పోస్టుమార్టంలో హైడ్రామా

పోలీస్ వర్సెస్ లాయర్స్

- పోస్టుమార్టానికి సహకరించని పోలీసులు
- బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిసిన సీఐలు
- సీఐని రక్షించేందుకేనంటూ న్యాయవాదుల ఆగ్రహం
- రాత్రి 7.30 గంటలకు పోస్టుమార్టం


మృతదేహం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనంతపురం క్రైం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో మృతి చెందిన సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించే విషయంలో హైడ్రామా నడిచింది. ఇందుకు సంబంధించి పోలీసులు, న్యాయవాదుల మధ్య వార్ నడిచింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే వ్యవహారమే జరిగింది. ఒకానొకదశలో పోస్టుమార్టం జరగనివ్వకుండా పోలీసులు అడ్డుకుంటున్నారనే ప్రచారం సాగింది. పోలీస్ అధికారుల తీరు అలాంటి విమర్శలకు తావిచ్చింది. ఉదయం 11.30 గంటలకు నుంచి సాయంత్రం వరకు పోస్టుమార్టం చేయలేదు. న్యాయవాదులు, చివరికి కుటుంబసభ్యులు ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టినా కనికరించలేదు. సీఐ శాంతిలాల్, ఎస్ఐ గోపాలుడును రక్షించేందుకే పోలీస్ అధికారులందరూ ఏకమయ్యారని న్యాయవాదులు విమర్శించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఏమి జరిగిందంటే..?

సివిల్ పంచాయితీలో భాగంగా త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సీఐ రమ్మన్నారని ఎస్ఐ గోపాలుడు న్యాయవాది శేషాద్రికి ఫోన్ చేసి చెప్పారు. శనివారం రాత్రి సీఐ శాంతిలాల్ చాంబర్‌లోకి పిలిపించారు. అప్పటికే సంబంధిత మహిళ క్రిష్ణవేణితో పాటు మరో నలుగురు ఉన్నట్లు న్యాయవాది జూనియర్లు చెబుతున్నారు. న్యాయవాది శేషాద్రితో పాటు జూనియర్లు దామోదర్, రాము, మరో వ్యక్తి వెళ్లారు. ఎస్ఐ గోపాలుడు సీఐ చాంబర్‌లోకి శేషాద్రి, రామునే పంపారు. వారి మొబైల్ ఫోన్లు తీసుకోవడంతో పాటు మిగిలినెవరినీ లోపలికి పంపలేదు. సివిల్ పంచాయితీ అని, ఆమె ఫిర్యాదు ఫేక్ అని చెబుతున్న సీఐ ఒకే సమయంలో రెండు వర్గాలతో ఏమి పంచాయితీ చేద్దామనుకున్నారో అంతుబట్టడం లేదు. శేషాద్రి కిందపడిపోయాక పోలీసులు సాయం పట్టలేదని దామోదర్ చెబుతుండటం గమనార్హం.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని కలవడంలో ఆంతర్యమేంటి..?

ఈ ఘటన విషయంలో రాత్రికి రాత్రి పోలీసులు జూనియర్ న్యాయవాది రాముకు సూచాయగా కొన్ని విషయాలు చెప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఐ చాంబర్లో ఉన్న రాము సీఐ ఏమీ అనలేదంటూ చెప్పేలా ఒప్పించారనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే ఆదివారం ఉదయం నగరంలో పోలీస్‌స్టేషన్లలో పనిచేసే సీఐలు, ఎస్ఐలు ఉదయం 8 గంటలకే అనంతపురం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురుప్రసాద్‌ను కలవడం అనుమానాలకు తావిచ్చింది. ఆయనను నిలువరించడానికే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయ సమావేశంలో గురుప్రసాద్...రాము ఏమీ లేదని చెబుతున్నారుగా, మరి వివాదమెందుకు అని మాట్లాడారు. ఇందుకు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌తో పాటు కొందరు న్యాయవాదులు అధ్యక్షుడిని నిలదీశారు. ఉన్నఫళంగా వెళ్లి నాలుగోరోడ్డులోని శేషాద్రి ఇంటి ఎదుట ఆందోళన నిర్వహించారు. పోస్టుమార్టం నిర్వహించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు ఉదయం 11.30 గంటలకు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు.


ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు, న్యాయవాదులు

అక్కడి నుంచే హైడ్రామా...

అక్కడి నుంచి ప్రభుత్వాసుపత్రిలో పోలీసులు వర్సెస్ న్యాయవాదుల మధ్య వార్ నడిచింది. పోస్టుమార్టం చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారంటూ న్యాయవాదులు ప్రశ్నించారు. ఈ సమయంలో సీఐలు, పోలీస్ సిబ్బంది అక్కడే ఉన్నారు. న్యాయవాదులు పోలీసులతో కొన్ని సందర్భాల్లో వాదనకు దిగారు. తొలుత సూపరింటెండెంట్ సరిగ్గా స్పందించ లేదు. నిబంధనల ప్రకారం చేయాలని, ప్రిన్సిపాల్ చూస్తారని చెప్పి వెళ్లిపోయారు. అలా గంటల పాటు ఇదే వ్యవహారం నడిచింది. ఆ తరువాత సూపరింటెండెంట్‌తో చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోయింది. అధికారులపైన ఒత్తిళ్లు పనిచేసినట్లు సమాచారం. ఈ క్రమంలో శేషాద్రి సోదరి వన్‌టౌన్ సీఐకు ఫిర్యాదు చేశారు. కానీ ఆ ఫిర్యాదు చెల్లదని, ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి, పోస్టుమార్టం నిర్వహించడానికి భార్య ఫిర్యాదు చేయాల్సి ఉంటుందంటూ పోలీసులు చెప్పుకొచ్చినట్లు తెలిసింది. దీంతో న్యాయవాదులు, శేషాద్రి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు దామోదర్, సుధాకర్‌రెడ్డి, అంజనేయులు, సాకే నరేష్, పోతులయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటరాముడు, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, న్యాయవాదులు నిరసన తెలిపారు. సాయంత్రం 6గంటల వరకు నిరసన కొనసాగింది. ఈ క్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్, సాయినాథ్, హేమంత్‌కుమార్, ఎస్బీ సీఐ క్రాంతికుమార్ అక్కడికి చేరుకున్నారు. ఇదే సందర్భంలో పోలీస్‌స్టేషన్‌లో మృతి చెందినట్లు కాకుండా ఫిర్యాదు ఇవ్వాలని, ఆ మేరకు కేసు నమోదు చేస్తామని పోలీస్ అధికారులు చెప్పుకొచ్చినట్లు తెలిసింది. ఇందుకు న్యాయవాద వర్గాలు విభేదించాయి. ఈ విషయం పెద్దది కావడంతో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వచ్చినట్లు తెలిసింది. ఆర్డీఓ కేశవనాయుడు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. రాత్రి 7.30 గంటలకు శేషాద్రి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.


మధ్యాహ్నం మార్చురీ బయట శేషాద్రి మృతదేహం, పక్కనే న్యాయవాదులు

రాష్ట్రవ్యాప్తంగా విధుల బహిష్కరణ

న్యాయవాది మృతిపై రాష్ట్ర బార్ కౌన్సిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బార్ అసోసియేషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు కోర్టు విధుల బహిష్కరణ చేపడుతున్నట్లు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.


2024 వెలుగులు 4


హంద్రీనీవా కాలువ



పునరుజ్జీవం!

ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ






గత ప్రభుత్వం నీరు ఇవ్వకపోవడంతో చెర్లోపల్లి రిజర్వాయర్‌లో అరకొరగా ఉన్న నీరు

కూటమి ప్రభుత్వంలో నీటితో కళకళలాడుతున్న చెర్లోపల్లి రిజర్వాయర్

ప్రతిపాదనలకే పరిమితమైన డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం


హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.1200 కోట్లతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు అలాగే ఉండిపోయాయి. గత ఐదేళ్లలో హంద్రీనీవా ఇంజనీర్లు మూడు దఫాలుగా ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం స్పందించలేదు. ఉరవకొండ ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వం 38వేల ఎకరాలకు సంబంధించి ప్రారంభించిన పనులను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. అర్ధంతరంగా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణ పనులు నిలిపివేయడంతో పిల్లకాలువల పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

అటకెక్కిన సామూహిక బిందుసేద్యం

హంద్రీనీవా ద్వారా సాగునీరు అందని పొలాలకు నీటి సదుపాయం కల్పించడానికి గత టీడీపీ ప్రభుత్వం సామూహిక బిందు సేద్యం (సీఎల్‌డీఐ) పథకాన్ని తీసుకువచ్చింది. రూ.840కోట్లతో 2017లో పనులకు శ్రీకారం చుట్టింది. తక్కువ నీటితో అధిక పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సంరక్షణ యోజన కింద సుమారు రూ.271కోట్లు నిధులు చెల్లిస్తామని అప్పట్లో చెప్పింది. ఉరవకొండ ప్రాంతంలోని బెళుగుప్ప, కూడేరు, ఉరవకొండ మండలాల్లో సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీఎల్‌డీఐ తీసుకువచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వం 2019లో పథకాన్ని పూర్తిగా రద్దు చేసింది. ఇందుకు సంబంధించి పరికరాలు మూలనపడేశారు.

బీటీపీ, పేరూరు ప్రాజెక్టులకు నిధులు చెల్లించేందుకు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బీటీపీ, పేరూరు ప్రాజెక్టు పనులను ఆమోదిస్తూ నిధులు కేటాయించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీటిని తరలించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.541కోట్లు నిధులు కేటాయించింది. అయితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ముందుకు సాగలేదు. అదే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు నీళ్లు తరలించేందుకు అప్పర్ పెన్నా ప్రాజెక్టుకు రూ.591కోట్లతో పనులు చేపట్టారు. 53కిలోమీటర్ల కాలువ పనులతో పాటు సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ తగరకుంట వద్ద రెండు జలాశయాలు నిర్మించాలని పనులు చేపట్టారు. అప్పటి టీడీపీ హయాంలో చేసిన రూ.164కోట్లు పనులకుగాను వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.100కోట్లకు పైగా బిల్లులు చెల్లించలేదు.


బిల్లులు చెల్లించని వైసీపీ సర్కార్


బీటీపీ..

> వైసీపీ పాలనలో కుదేలైన సాగునీటి రంగం పునరుజ్జీవానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్నికల గిమ్మిక్కులతో వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది తప్ప ప్రాజెక్టుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే కూటమి సర్కారు కొలువు దీరిన తర్వాత ఉమ్మడి జిల్లా సాగు, తాగునీటి అవసరాలను తీర్చే హెచ్చెల్సీ, హంద్రీనీవా అభివృద్ధి, మరమ్మతులకు రూ.కోట్ల నిధులు విడుదల చేసింది. వైసీపీ పాలనలో గ్రహణం పట్టిన ప్రాజెక్టుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిపోయిన సాగు నీటి ప్రాజెక్టుల పనులను పునఃప్రారంభించాలని కూటమి సర్కారు నిర్ణయించింది. కాలువల వెడల్పు, మరమ్మతులు, ముళ్ల పొదలు తొలగించడానికి నిధులు కేటాయించింది. బీటీపీ, పీఏబీఆర్ పనులను వేగంగా పూర్తి చేస్తామని ఇటీవల జిల్లాలో పర్యటించిన సందర్భంలో సీఎం ప్రకటించారు. ఐదేళ్ల కాలంలో పడకేసిన సాగునీటి పనులపై నిధుల వరద పారించి, త్వరగా పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ప్రయత్నిస్తోంది. ఈక్రమంలోనే ఎన్నికలు నిర్వహించి సాగునీటి సంఘాలకు జవసత్వాలు కల్పించింది.

- హెచ్చెల్సీ, హంద్రీనీవా అభివృద్ధికి రూ.కోట్ల నిధులు
- ఎన్నికలతో సాగునీటి సంఘాలకు జవసత్వాలు
- ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడానికి కూటమి సర్కారు యత్నం
- వైసీపీ పాలనలో కుదేలైన సాగునీటి రంగం

అనంతపురం క్లాక్‌టవర్/పుట్టపర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటూ, గత ఐదేళ్లుగా రైతులకు ఎటువంటి మేలు చేయని వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై శీతకన్ను వేసింది. జిల్లాలోని హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టుల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అయితే ఆరు నెలల కిందట ఏర్పడిన కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యాన్ని గుర్తించి, అవసరమైన నిధులు విడుదల చేస్తోంది. బీటీపీ, పేరూరు ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. హంద్రీనీవా ఫేజ్-2 కింద 2016 కిలోమీటర్ జీడిపల్లి నుంచి కదిరి దగ్గర 400కిలోమీటరు వరకు సుమారు 190కిలోమీటర్ల వరకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయడానికి రూ.936కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా హెచ్చెల్సీ కింద అత్యవసరమైన 11పనుల మరమ్మతులకు, నిర్మాణాలకు రూ.36కోట్లు మంజూరు చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారు. జనవరి లేదా ఫిబ్రవరిలో పనులు చేపట్టేందుకు హెచ్చెల్సీ ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు.


జీడిపల్లి రిజర్వాయర్

చంద్రబాబు హామీ

జీడిపల్లి నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తరలించేందుకు కాలవ నిర్మాణం, భూసేకరణ పూర్తి చేయడానికి రూ.500కోట్లు చెల్లించేందుకు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తరలించేందుకు భూసేకరణ, కాలవ నిర్మాణానికి రూ.350కోట్లు చెల్లిస్తామని జిల్లా పర్యటనలో ప్రకటించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలోని పేరూరు ప్రాజెక్ట్, భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ)ల గేట్లు, మరమ్మతులకు, గుర్తించిన పలు చెరువుల మరమ్మతులు, గండ్లు పూడ్చేందుకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన జలవనరుల శాఖకు కూటమి ప్రభుత్వం నిధుల వరద పారిస్తోంది.


పేరూరు డ్యాం

శ్రీసత్యసాయి జిల్లాలో..

శ్రీసత్యసాయి జిల్లాకు వరప్రదాయిని అయిన హంద్రీనీవా కాలువ వెడల్పు, ముళ్ల పొదల తొలగింపు పనుల గురించి గత వైసీపీ ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందుచూపులేకపోవడం జిల్లా రైతాంగానికి శాపంగా మారింది. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కుప్పానికి జీడీపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు కాలువ ద్వారా కృష్ణా నీళ్లు తరలించారు. అందుకోసం మడకశిర, పుంగనూరు ఉపకాలువ కింద రిజర్వాయర్లు, గొల్లపల్లి, బుక్కపట్నం మండలంలోని మారాల, కదిరి మండలం చెర్లోపల్లి జలాశయాలకు నీరు ఇవ్వకుండా ఎండబెట్టారు. దీంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. అయితే ఆరు నెలల కిందట సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ఆపేసిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు కొత్త ప్రాజెక్టులను నిర్మించి, ప్రతి ఎకరాకు సాగు నీరు ఇవ్వాలన్న సంకల్పంతో బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

గత వైసీపీ ప్రభుత్వంలో నిరాదరణకు గురైన సాగునీటి సంఘాలకు జవసత్వాలు తెచ్చేదిశగా కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. ఈక్రమంలోనే ఇటీవల సాగునీటి సంఘాలకు ఎన్నికలు కూడా నిర్వహించింది. గత

సాగునీటి సంఘాల ఏర్పాటు

ప్రభుత్వం సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయకపోవడంతో చెరువుల్లో పూడికతీత, మరమ్మతులు, కాలువ గట్ల బలోపేతం వంటి ముఖ్యమైన పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఆవశ్యకతను గుర్తించి, నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసింది. దీంతో క్షేత్రస్థాయిలో నీటి ప్రాజెక్టుల బాగోగులు చూసుకునేవారిని నియమించినట్లు అయ్యింది.

ఎన్నికల వేళ డ్రామా....

పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులకు నీరుఇవ్వాలని రాయలసీమ కరవు నివారణ పథకం కింద 2021 జనవరిలో రూ. 864.18 కోట్లతో ఎత్తిపోతల పథకం ప్రారంభించారు. అదే ఏడాది మేలో అప్పటి సీఎం జగన్‌తో శంకుస్థాపన చేశారు. 2022 డిసెంబరు నాటికి తొలి విడతగా పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల్లోని అన్ని చెరువులకు నీరు ఇస్తామని ప్రకటించారు. ఇందుకోసం 2021లోనే టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి 2022 ఫిబ్రవరిలో ప్రక్రియ పూర్తి చేశారు. పనులను పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యేకి చెందిన ఏఎస్ఆర్, ఎస్‌సీఎల్ కాంట్రాక్టు కంపెనీకి రూ. 735 కోట్లకు అప్పగించారు. 36 నెలల్లో పనులు పూర్తి చేయాలన్న నిబంధన విధించినా రెండేళ్లు ఉలుకూ, పలుకు లేకుండాపోయింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జనవరి19న నల్లగొండ రిజర్వాయర్ పనులకు ఎమ్మెల్యే, ఎంపీలు శంకుస్థాపన చేశారు.


గత వైసీపీ ప్రభుత్వంలో నీరు ఇవ్వకుండా ఎండబెట్టిన మడకశిర ఉపకాలువ

హెచ్చెల్సీలో అత్యవసర 11పనులకు రూ.36కోట్లు మంజూరు

హెచ్చెల్సీకి అత్యంత ప్రాధాన్యత కింద 11పనులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన రూ.36కోట్లు నిధులను మంజూరు చేసింది. ప్రధానంగా హెచ్ఎల్ఎంసీ 165.028 కిలోమీటర్ వద్ద నిలిచిపోయిన బ్రిడ్జిని పూర్తి చేయడానికి రూ.1.59కోట్లు కేటాయించారు. 169.400కిలోమీటర్ వద్ద వంతెన నిర్మాణానికి రూ.1.91కోట్లు మంజూరు చేశారు. 155.81కిలోమీటర్ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణానికి రూ.1.53కోట్లు కేటాయించారు. 115.167కిలోమీటర్ వద్ద వంతెన పూర్తి చేయడానికి రూ.1.66కోట్లు కేటాయించారు. 117.794కిలోమీటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80కోట్లు కేటాయించారు. 147.395కిలోమీటర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అవుట్‌పాల్ రెగ్యులేటర్ పూర్తి చేయడానికి రూ.4.21కోట్లు కేటాయించారు. 137.702కిలోమీటర్ వద్ద అండర్ టన్నెల్ పునర్నిర్మాణానికి రూ.4.21కోట్లు మంజూరు చేశారు. 189.126 కిలోమీటర్ వద్ద పీఏబీఆర్ లింకుచానల్ పునర్ నిర్మాణానికి రూ.4.10కోట్లు కేటాయించారు. 189.126 కిలోమీటర్ వద్ద ఎంపీఆర్ రెగ్యులేటర్ ఓటీ మోపిడి వద్ద రెగ్యులర్ నిర్మాణానికి రూ.4.14కోట్లు మంజూరు చేశారు. 115 కిలోమీటర్ నుంచి 130కిలోమీటర్ వరకు లైనింగ్ నిర్మాణానికి రూ.9.80కోట్లు వేయడానికి కేటాయించారు. కణేకల్లు చెరువు ఒకటో కిలోమీటర్ వద్ద ఆఫ్‌టెక్ స్లూయిస్-3 నిర్మాణానికి రూ.22లక్షలు కేటాయించారు. కాగా పీఏబీఆర్‌లో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు ఉంచడానికి అవసరమైన పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఇందుకోసం దాదాపు రూ.450 కోట్లకు పైగా నిధుల అవసరం ఉన్నట్లు సాగునీటి రంగ ఇంజనీర్లు స్పష్టం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం రాకతో నిధుల గలగల

గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా ప్రధాన కాలువతో పాటు మడకశిర ఉప కాలువ వెడల్పు పనులు చేయడానికి హడావిడి చేసిందే తప్ప పైసా నిధులు విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొన్ని రోజుల్లోనే సాగు నీటి ప్రాజెక్టులపై కదలిక తీసుకువచ్చింది. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా కృష్ణాజలాలు పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు చేపట్టింది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువ లైనింగ్ పనుల కోసం రూ. 57.80 కోట్లు కేటాయించింది. 285.100 కి.మీ నుంచి 287.100 కి.మీ టన్నెల్ ఏర్పాటుకు కోసం రూ.36.19 కోట్లు మంజూరు చేసింది. 300కి.మీ నుంచి 320 కి.మీ వరకు పెండింగ్‌లో ఉన్నా పనులకు (చెన్నేకొత్తపల్లి మండలంలో) రూ. 108.32 కోట్లు కేటాయించింది. 320కి.మీ నుంచి 340కి.మీ వరకురూ. 61.04 కోట్లు, 340కి.మీ నుంచి 356 కి.మీ వరకు పెండింగ్ పనులతో పాటు ప్రధాన కాలువ ఆధునికీకరణకు రూ.119.35 కోట్ల నిధులు మంజూరు చేసింది.


358. 150కి.మీ నుంచి 360.250 కి.మీ వరకు టన్నెల్ పెండింగ్ పనుల ఇతరత్ర నిర్మాణాలకు (బుక్కపట్నం) మండల పరిధిలో రూ.55.40 కోట్లు, 360.400 కి.మీ నుంచి 380.150 కి.మీ వరకు పెండింగ్ పనుల పూర్తి కోసం రూ. 161.60 కోట్లు, 380 కి.మీ నుంచి 400 కి.మీ వరకు (ముదిగుబ్బ మండలం పరిధిలో)పెండింగ్ పనులకు రూ.79.60 కోట్ల నిధులు మంజూరు చేశారు. మడకశిరలో రత్నగిరి, రాళ్లపల్లి రిజర్వాయర్ల డీపీఆర్ కోసం కూటమి ప్రభుత్వం రూ. 37 లక్షలు మంజూరు చేసింది.

మడకశిర ఉప కాలువ విస్తరణకు రూ.250 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రారంభించిన, ప్రతిపాదిత పనులు పూర్తయితే జిల్లాకు మళ్లీ నీటి కళ వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈప్రాజెక్టు కోసం 1200 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నా కేవలం నల్లగొండ, గాజులపల్లి రిజర్వాయర్ల ముంపునకు గురయ్యే భూములను గుర్తించి నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే భూనిర్వాసితులకు పైసా నిధులు ఇవ్వలేదు. ఇదంతా ఎన్నికల డ్రామాగా గుర్తించిన ప్రజలు వైసీపీకి ఓటుతో గుణపాఠం చెప్పారు.


ఇటీవల తలుపుల, నంబులపూలకుంట కాలువకు నీటిని విడుదల చేసిన దృశ్యం


వైసీపీ పాలనలో అరకొర నీటితో గొల్లపల్లి రిజర్వాయర్


హంద్రీనీవా ఎత్తిపోతల పథకం


వైసీపీ పాలనలో తలుపుల, నంబులపూలకుంట మండలాలకు వెళ్లే హంద్రీనీవా ప్రధాన కాలువకు నీరు ఇవ్వకుండా ఎండబెట్టిన దృశ్యం


ముదిగుబ్బ మండలం నాగిరెడ్డిపల్లి నుంచి విడుదలై హంద్రీనీవా కాలువలో పారుతున్న నీరు

డీఎస్సీ ఎస్జీటీ టాలెంట్ టెస్టుకు స్పందన


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డైట్ కళాశాల అధ్యాపకుడు రామకృష్ణ

కొత్తచెరువు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వదాన్య ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించింది. ప్రభుత్వం త్వరలో డీఎస్సీని నిర్వహిస్తుండటంతో అభ్యర్థుల ప్రజ్ఞను వెలికితీసేందుకు వదాన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థుల కోసం మండల కేంద్రంలో ఆదివారం పరీక్షను నిర్వహించారు. ఈ టెస్టుకు 1100 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను బుక్కపట్నం డైట్ కళాశాల అధ్యాపకులు రామకృష్ణ పరిశీలించారు. జనవరి 15న ఫలితాలను విడుదల చేస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు అశోక్ పడపాటి తెలిపారు. మండల కేంద్రంలో ఐదు పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులు పరీక్షలు రాయగా వారికి ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా అన్ని వసతులు కల్పించారు. ఈ కేంద్రాలను సీఐ ఇందిర తనిఖీ చేశారు.

అనారోగ్యంతో ఎస్ఐ మృతి

తాడిపత్రి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగవీరయ్య (60) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన నాగవీరయ్య 1987లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో విధుల్లో చేశారు. హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్ఐగా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. 2021లో ఉద్యోగోన్నతిపై తాడిపత్రి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం ఆయన సొమ్మసిల్లి పడిపోవడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం తెల్లవారుజామున ఆరోగ్యం విషమించి, ఆయన మరణించారు. తాడిపత్రికి తరలించి, పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్ఐకి భార్య సరోజ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


నాగవీరయ్య(ఫైల్)

రైల్వే జీఎం అవార్డుకు ఇద్దరు ఉద్యోగుల ఎంపిక


మనోజ్‌కుమార్


మల్లికార్జున

గుత్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జీఎం అవార్డుకు ఎంపికయ్యారు. డీజిల్ షెడ్‌లో పనిచేస్తున్న ఆఫీసు సూపరింటెండెంట్ మల్లికార్జున, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ మనోజ్‌కుమార్ ఎంపికైన వారిలో ఉన్నారు. జనవరి 3న సికింద్రాబాదులో రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా వీరు అవార్డు అందుకోనున్నారు. స్థానిక డీజిల్ షెడ్‌లో పనిచేస్తున్న మల్లికార్జున 2001లో అసిస్టెంట్ లోకో పైలెట్‌గా ఉద్యోగంలో చేరాడు. 2006 ఏప్రిల్ 9న జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయాడు. దీంతో రైల్వే శాఖ 2009లో గుత్తిడీజిల్ షెడ్‌లో జూనియర్ క్లర్క్ ఉద్యోగం ఇచ్చింది. అప్పటి నుంచి విధులను నిబద్ధతతో నిర్వహిస్తూ 2014, 17 సంవత్సరాల్లో రైల్వే సేవా అవార్డులను అందుకున్నాడు. తిరిగి 2024-25 ఏడాదికి సంబంధించి దక్షిణ మధ్య రైల్వే జీఎం అవార్డుకు ఎంపికయ్యాడు. మనోజ్ కుమార్ డీజిల్ షెడ్‌లో సీనియర్ సెక్షన్ ఇంజనీర్, ఎలక్ట్రికల్ డీజిల్ లోకో షెడ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన ఎలక్ట్రికల్ లోకోలకు ఉపయోగించే కార్డ్ టెస్టింగ్ స్టాండ్‌ను కనుగొన్నాడు. ఈ కార్డ్ వల్ల ఎలక్ట్రికల్ లోకోలో మరమ్మతులు తగ్గే అవకాశం ఉందన్నారు. దీంతో ఈయన జీఎం అవార్డుకు ఎంపికయ్యాడు. వీరి ఎంపిక పట్ల సీనియర్ డీఎంఈ ప్రమోద్, సెక్షన్ ఇంజనీర్లు, కార్మికులు, కార్మిక సంఘనాయకులు హర్షం వ్యక్తం చేశారు.

జీవిత సంఘర్షణలను ఆవిష్కరించిన సీమ సాహిత్యం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతం నుంచి వెలువడిన సాహిత్యం జీవన సంఘర్షణలను ఆవిష్కరించిందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సాహిత్య అకాడమీ, విమలాశాంతి సాంస్కృతిక సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో 'రాయలసీమ సాహిత్యం-బహుజన జీవితం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆచార్య రాచపాళెం ప్రసంగించారు. రాయలసీమ నుంచి బహుజన జీవితం ఇంకా రావాల్సిన అవసరముందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ సాహిత్య ప్రచారంకోసం నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. విమలాశాంతి సాంస్కృతిక సేవాసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ సాహిత్య అకాడమీ చేపడుతున్న సాహిత్య కార్యక్రమాలు ఎంతో విలువైనవని, కవులు, రచయితలు, సాహిత్య సంస్థలు ముందుకు వచ్చి అనేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ భావికాటి రాఘవేంద్ర, అంకె శ్రీనివాస్, కొత్తపల్లి సురేష్, ఆచార్య వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి, ఎస్ఎం బాషా, గోవిందరాజులు, వన్నప్ప, డాక్టర్ నానీల నాగేంద్ర, తూముచెర్ల రాజారాం, గోసల నారాయణస్వామి, చేగువేరా హరి, జూటూరు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు సీట్లు కేటాయించండి

నసనకోట పాఠశాలను అప్‌గ్రేడ్ చేయండి: గురుకుల పాఠశాలల కార్యదర్శిని కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత


గురుకుల పాఠశాలల కార్యదర్శితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి ప్రతి తరగతికి అదనపు సీట్లు కేటాయించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత గురుకుల పాఠశాలల కార్యదర్శి కృష్ణమోహన్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంజేపీ గురుకులపాఠశాలల కార్యదర్శి కృష్ణమోహన్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం పేరూరు, నసనకోట పాఠశాలల పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. గురుకుల పాఠశాలల పరిస్థితి గురించి చర్చించారు. రామగిరి ప్రాంతం అత్యంత వెనుకబడినదని, ఇందులో కూలీలు అధికంగా ఉన్నారని, వీరి పిల్లలను దూరంగా వెళ్లి చదివించే పరిస్థితి లేదని ఆమె తెలిపారు. పేరూరు, నసనకోట ఎంజేపీ గురుకుల పాఠశాలపై ఆధారపడి ఉన్నారన్నారు. తగినన్ని సీట్లు లేక పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వచ్చే ఏడాది నుంచి అదనపు సీట్లు, తరగతులు కేటాయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నసనకోట ఎంజేపీ గురుకుల పాఠశాలను ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. చాలామంది బాలికలు 10వ తరగతి తరువాత దూరప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే చదువును ఆపేస్తున్నారని తెలిపారు. వీటిపై ఇప్పటికే సంబంధిత మంత్రికి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత చెప్పిన అన్ని అంశాలకు కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. పరిశీలించి మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

1.681 టీఎంసీల నీటి నిల్వ



బెళుగుప్ప, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వ 1.681 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 802 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 177 క్యూసెక్కుల నీరు వెళుతున్నట్లు వారు పేర్కొన్నారు.

సంక్షిప్తం

తగ్గిన టమోటా ధరలు

● కిలో రూ.8

అనంతపురం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు భారీగా తగ్గిపోయాయి. కొన్నిరోజులుగా టమోటా ధరలు తగ్గుతున్నాయి. స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో గరిష్ఠ ధర రూ. 10 నుంచి రూ. 15మధ్య పలికింది. ఆదివారం మరింత తగ్గి, గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయి నట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 2250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.6, కనిష్ఠ ధర రూ.4 పలికినట్లు ఆయన తెలిపారు.

సంత ఆదాయం రూ.3.39 లక్షలు

అనంతపురం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశువులసంతతో రూ. 3,39,690 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 1,59,890, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ. 1,79,800 వచ్చిందని తెలిపారు.

విజయవంతం చేయండి

రాప్తాడు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను లోక్‌సభలో అవహేళనగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న అనంతపురంలో జరిగే వామపక్షాల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వామపక్ష నాయకులు పిలునిచ్చారు. ఈ మేరకు వారు ఆదివారం రాప్తాడులో విలేరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాల రంగయ్య, రామాంజినేయులు, పోతులయ్య, సుబ్బిరెడ్డి, ధనుంజయ పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించండి



అకాడమీ చైర్మన్‌ను సన్మానిస్తున్న రత్నమోహన్

అనంతపురం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కళాకారుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలక్రిష్ణను మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు దేవరకొండ రత్నమోహన్ కోరారు. జిల్లా కేంద్రంలోని లలిత కళా పరిషత్‌లో ఆదివారం గోపాల క్రిష్ణను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారుల సమస్యలను రత్నమోహన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక

రాప్తాడు, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ రాప్తాడు నియోజకవర్గ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎంపిక చేసినట్లు సీపీఐ నాయకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా హరీష్, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయను ఎంపిక చేశామన్నారు. విద్యార్థులు సమస్యలపై పోరాడుతామని వారు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నార్పల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దిరాచర్ల గ్రామ పంచాయతీ దుర్గం గ్రామం కమ్యూనిటీహాల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నంద్యాలలోని శాంతిరాం హస్పిటల్ సహకారంతో సర్పంచు సాకే రామాంజినేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్థులకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అవసరమైె వారికి శాంతిరాం హస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేసి, కంటి అద్దాలను ఇస్తామని సర్పంచు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యుడు తిప్పేస్వామి, వార్డు మెంబరు ఉజ్జినప్ప, పరంధాముడు, పార్వతి, పల్లన్న, సోమశేఖర్, వీరనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌ఫిల్మ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న మధుసూదన్

నార్పల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కంటెంట్ క్రియేటర్ అవార్డ్ 2024కు రామ్ షార్ట్ ఫిల్మ్ ఎంపికైంది. నార్పల మండలం హెచ్ సోదనపల్లికి చెందిన మధుసూదన్ తానే డైరెక్టర్‌గా, హీరోగా రామ్ అనే షార్ట్ ఫిల్మ్‌ను తీశారు. ఈనెల 22న అనంతపురంలోని నీలిమా థియేటర్‌లో రిలీజ్ అయింది. అది కంటెంట్ క్రియేటర్ అవార్డ్ 2024కు ఎంపికైనట్లు మధుసూదన్ తెలిపారు. ఆదివారం అనంతపురంలో అందుకున్నట్లు తెలిపారు.

'సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా'

రామగిరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా ఉంటుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. సభ్యత్వ నమోదు తక్కువగా జరిగిన గ్రామాలలో ప్రత్యేక కార్యాచరణతో ఇంటింటికి వెళ్లి, టీడీపీ సభ్యత్వం చేసుకుంటే కలిగే ప్రయోజనాలను తెలియజేస్తున్నారు. ఇప్పటికే రామగిరిలో సభ్యత్వ నమోదు జోరుగా కొనసాగుతోందని వారు తెలిపారు. కార్యక్రమంలో పేరూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్డి సుబ్బు, మండల కోశాధికారి శ్రీనివాసులు, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి సాధ్యమేనా..?

● ఐదేళ్ల వైసీపీ పాలనలో తయారీ కేంద్రాలపై నిర్లక్ష్యం
● రూ.లక్షల ఖర్చు వృథా
● కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆశలు



శింగనమలలో నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

శింగనమల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో సంపద సృష్టి ఏమో గాని ప్రజా ధనం చెత్తలో కలిసిపోతోంది. గత టీడీపీ పాలనలో లక్షలాది రూపాయలు ఖర్చు చేపి చెత్తతో సంపద తయారీ కేంద్రాలను ప్రతి పంచాయతీలోనూ నిర్మించారు. చేత్త సేకరణకు ప్రతి కేంద్రానికి ఇద్దరి నుంచి ఐదుగురి వరకు కార్మికుల (క్లాప్ మిత్రలు)ను నియమించారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, దాన్ని రీసైక్లింగ్ ద్వారా ఎరువుగా మార్చి తక్కువ ధరకు రైతులకు అందించాలి. ఇందు కు ఒక్కో కార్మికుడికి నెలకు రూ.ఆరు వేలు జీతం ఇచ్చేవారు. గత వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా గాలికి వదిలేయడంతో కొన్ని చోట్ల సంపద తయారీ కేంద్రాలు దిష్టిబొమ్మల్లా మారాయి. ఇంటింటి నుంచి చెత్త సేకరించడానికి ప్రభుత్వం అందించిన



తుప్పు పట్టిన మూడు చక్రాల వాహనం

సైకిళ్లు తుప్పు పట్టిపోయాయి. జీతాలు సక్రమం గా రాకపోవడంతో క్లాప్ మిత్రలు చెత్త సేకరణకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చింది కావున గ్రామాలలో నిరుప యోగంగా ఉన్న చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

18 పంచాయతీల్లోనూ... నిరుపయోగంగా...

శింగనమల మండలంలో 19 పంచాయతీలుండగా, నాగులగుడ్డం తండా మినహా 18 పంచాయతీల్లో 2014- 19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఖర్చు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించింది. క్లాప్ మిత్రలు గామాల్లో సేకరించిన చెత్త ను ఈ సంపద కేంద్రాల్లో తడి, పోడి చెత్తగా విభజిస్తా రు. వాటి ద్వారా ఎరువులు తయారు చేసి రైతులకు అమ్మి, వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వా డాలన్నది ప్రభుత ఉద్దేశ్యం. అయితే తరువాత వైసీపీ పాలన రావడంతో గత ఐదేళ్లలో ఏనాడు సంపద కేంద్రాలపై దృష్టి సారించలేదు. పంచాయతీల అభివృద్ధికి ఉపయోగంగా ఉన్న సంపద కేంద్రాలను నిరూప యోగంగా మార్చారు. మూడు చక్రాల సైకిళ్లు తుప్పు పట్టిపోయాయి. ప్రస్తుత్తం వాడుకోవడానికి వీలులేకుం డా పోయాయి. రూ.లక్షల ఖర్చుతో నిర్మించిన కేంద్రా లు నిరుపయోగంగా ఉన్నాయి.

అపరిశుభ్రంగా మారిన గ్రామాలు



మాది శింగనమల. గత టీడీపీ పాలనలో ఇంటికి రెండు డబ్బాలు ఇచ్చారు. ఇంట్లోని తడి, పొడి చెత్తను వాటిలో వేస్తాం. కార్మికులు ఉదయం వచ్చి మూడు చక్రాల సైకిళ్లలో తీసుకెళ్లే వారు. సంపద తయారీ కేంద్రంలో వేసేవాళ్లు. అయితే వైసీపీ పాలనలో గ్రామంలో చెత్తను కార్మికులు తీసుకెళ్లి ఊరి బయట వేశారు. క్రమంగా వారు చెత్తను సేకరించక పోవడంతో గ్రామాలు అపరిశుభ్రంగా మారాయి. ఇప్పటి ప్రభుత్వమైనా సంపద కేంద్రాలను పునః ప్రారంభించాలి.

- నాగలాపురం విజయకుమార్, శింగనమల

వైసీపీ పాలనలో పూర్తిగా విస్మరించారు



గత వైసీపీ ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాల అభివృద్ధిని పూర్తిగా పట్టించుకోలేదు. కనీసం అందులో పని చేసే కార్మికులకు జీతాలు సక్రమంగా ఇవ్వలేదు. దీంతో కొంతమంది కార్మికులు చెత్త సేకరణకు రావడం మానేశారు. ఈ సమస్యపై కూటమి ప్రభుత్వ దృష్టి పెట్టి చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలి.

- రాజు, సర్పంచ్, పెరవలి

త్వరలో వాడుకలోకి తెస్తాం



రాష్ట్ర ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. సంపద కేంద్రాలను వాడుకలోకి తీసుకుని రావడానికి రంగం సిద్ధంగా ఉంది. గతంలో మాదిరి పంచాయతీల అభివృద్ధికి, సంపద కేంద్రాలను త్వరలో వాడుకలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం. వావానాలకు మరమ్మతులు చేపట్టి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరిస్తాం. దానిని కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసేలా చూస్తాం

- వెంకటలక్ష్మి, ఈఓపీఆర్‌డీ

రోడ్డు పనుల నాణ్యతలో రాజీపడొద్దు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



తారు రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల నాణ్యతలో రాజీ పడొద్దని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో జరుగుతున్న తారు రోడ్డు పనులను ఆదివారం టీడీపీ నాయకు లతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ హయాంలో నగరంలోని రోడ్లన్నీ అధ్వానంగా ఉండేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే రోడ్లకు మహర్దశ వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగారామ్, నెట్టెం బాలకృష్ణ, పీఎం లక్ష్మీప్రసాద్, పంచాయతీరాజ్ చాంబర్ నాయకులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : ఆరుగురికి గాయాలు

గార్లదిన్నె, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడి ఆరుగురికి గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని కమలాపురం క్రాస్ హెచ్ఎల్సీ వద్ద చోటుచేసుకుంది. కమలాపురం, కొట్టాలపల్లికి చెందిన 12 మంది మహిళా కూలీలు కొట్టాలపల్లి వద్ద చీనీ చెట్లకు ఎరువులు వేసేందుకు ఉదయం ట్రాక్టర్‌లో బయలుదేరారు. హెచ్ఎల్సీ సమీపంలో పెనకచెర్ల వైపు నుంచి ద్విచక్ర వాహనం వచ్చింది. దానిని తప్పించే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న 12 మంది మహిళా కూలీలు కిందపడ్డారు. నిర్మల, రాధమ్మ, జయలక్ష్మి, కాశింబీ, సావిత్రి, లక్ష్మీదేవికి గాయాలు కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన కూలీలను రైతులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. మహిళా కూలీలు గాయపడిన విషయం తెలుసుకున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

ప్రపంచస్థాయి ప్రమాణాలను పాటిస్తున్న ప్రాక్సో

● సినీ నటుడు గురు చరణ్



గురుచరణ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రాక్సో అధినేతలు సుధీర్, విజయ్, ప్రణవ్

అనంతపురం క్రైం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వాసులు రూపొందించిన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ప్రాక్సో అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రమాణాలను పాటిస్తోందని, దీనిని అందరూ వినియోగించుకుని ఆదాయం పొందవచ్చని సినీనటుడు కోడూరు గురుచరణ్ అన్నారు. స్థానిక వివాహ భోజనం ఫంక్షన్ హాల్‌లో ప్రాక్సో యాప్ పరిచయ సభ, జిల్లా వ్యాప్తంగా ఉన్న సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గురుచరణ్, విశిష్ట అతిథిగా డాక్టర్ హరిప్రసాద్, ప్రత్యేక అతిథిగా క్రియేటర్ కృష్ణ హాజరయ్యారు. చిన్నారి లాలిత్య సంప్రదాయ నృత్యం ఆహుతులను అలరించింది. ప్రాక్సో యాప్ అధినేత ముడార్ సుధీర్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న తనకు, అనంతపురం వాసులకు సాంకేతికంగా ఏదో ఒకటి చేయాలనే తపనే ప్రాక్సో రూపంలో వచ్చిందన్నారు. అనంతరం కంటెంట్ క్రియేటర్స్‌కు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది, అధ్యాపకులు నామసేవ హరికృష్ణ, అబ్బా టీవీ హరిప్రసాద్, రాయలసీమ జాగృతి ఫౌండేషన్ చైర్మన్ శ్రీహరి మూర్తి, ఫొటో డైట్ పవన్, రహంతుల్లా, షర్మాస్‌వలి, కంటెంట్ క్రియేటర్స్ పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతికత చాలా అవసరం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



పంట కోత యంత్రాలు పొందిన రైతులతో ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి) : వ్యవసాయంలో సాంకేతికత చాలా అవసరమని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. నగరంలోని ఆమె క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం రాప్తాడు నియోజకవర్గంలోని పలువురు రైతులకు సబ్సిడీపై మంజూరైన పంట కోత యంత్రాలను పంపిణీ చేశారు. కనగానపల్లి మండలం తూముచర్లకు చెందిన వనికేరప్ప, చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లికి చెందిన అశ్వత్థరెడ్డి, ప్యాదిండికి చెందిన నరసింహులుకు ఆమె పంపిణీ చేశారు. మరింత మంది రైతులకు అంద జేసేందుకు కృషి చేస్తామన్నారు. కాగా... కొన్నేళ్లుగా ఇలాంటి యంత్రాలు వస్తా యని ఆశించినా ఎవరూ ఇవ్వలేదని, తమకు యంత్రాలు ఇప్పించినందుకు ఎమ్మెల్యే పరిటాల సునీతకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

ఆత్మకూరు డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలవలోని పి సిద్దరాంపురానికి చెందిన చెంద్రెడ్డి నరసింహులుకు రూ.50వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పరిటాల సునీత అందజేశారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివా రం లబ్ధిదా రుడికి అందజేశారు. టీడీపీ నాయకుడు శశాంక చౌదరి పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో సమావేశపు హాల్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ట్రస్ట్ చైర్మన్ శివకృష్ణచౌదరి

నార్పల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శివకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నార్పల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మించిన సమావేశపు హాల్‌ను శనివారం ఆ ట్రస్ట్ చైర్మన్ శివకృష్ణచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకృష్ణచౌదరి మాట్లాడుతూ యువతకు విద్య, ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా తమ ట్రస్ట్ పని చేస్తోందన్నారు. త్వరలోనే నార్పలలో ట్రస్ట్ కార్యాలయం ప్రారంభించి ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా కృషి చేస్తామన్నారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ నార్పల మండలంలో శివకృష్ణచారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. ట్రస్ట్ ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, రంగాపురం సర్పంచు కుళ్లాయప్ప, బలిజ సంఘం అధ్యక్షుడు ఇండ్ల రంగనాథ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆకుల లోకనాథ్, చామలూరు శ్రీనివాసులు, బండ్లపల్లి శేషానందరెడ్డి, పసుపులేటి లక్ష్మీనారాయణ, పప్పూరు శ్రీనివాసులు, గొల్లపల్లి పోతులయ్య, గూగూడు నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

'పిల్లల్లో వికాసానికే అనంత బాలోత్సవం'

అనంతపురం కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో వికాసానికే అనంత బాలోత్సవం-పిల్లల పండుగ నిర్వహిస్తున్నట్లు అనంత బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని లలితకళా పరిషత్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన బాలోత్సవ కమిటీ ఆహ్వాన సంఘం ఏర్పాటు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, లలితకళా పరిషత్ కార్యదర్శి పద్మజ, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు పల్లవి, రవికాంత్ రమణ, పట్నం శివప్రసాద్, నాట్యాచార్యురాలు సమీనా, ఎస్టీయూ రమణారెడ్డి, యూటీఎఫ్ కోడేశ్వరప్ప, రమణయ్య, మహ్మద్ జిలాన్, లింగమయ్య, మెడికల్ రెప్స్ అసోసియేషన్ నాయకుడు శ్రీనివాసులుతోపాటు మొత్తం 60 మందితో బాలోత్సవం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు.

డిఫెన్స్ మద్యం స్వాధీనం

అనంతపురం అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది బృందాలుగా డిఫెన్స్ మద్యంపై ఆకస్మిక దాడులు చేశారు. నలుగురి నుంచి 79 ఫుల్ బాటిళ్ల డిఫెన్స్ మద్యంను స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు సత్యనారాయణ, అన్న పూర్ణ, జయనాథ్‌రెడ్డి, ఎస్ఐలు జయ నరసింహ, జాకీర్ హుస్సేన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపిక పోటీల్లో గందరగోళం

●అనర్హులకు చోటు కల్పించారంటూ ఆందోళన



సీఐతో వాగ్వాదం చేస్తున్న క్రికెటర్ల తల్లిదండ్రులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీల్లో గందరగోళం నెలకొంది. అండర్-12 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ ఎంపిక పోటీలు ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో నిర్వహించారు. 12ఏళ్ల వయసుపైబడిన, హైదరాబాద్, బెంగళూరులలో నివాసముంటూ, అక్కడే ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎలా ఎంపిక చేస్తారంటూ కొందరు క్రీడాకారుల తల్లిదండ్రులు నిరసనకు దిగారు. అనంత క్రికెట్ గ్రౌండ్-బిలో ఎంపిక మ్యాచ్ నిర్వహించేందుకు జిల్లా క్రికెట్ సంఘం ఏర్పాట్లు చేసింది. అయితే అర్హత ఉన్నా జట్టులో స్థానం దక్కని క్రీడాకారుల తల్లిదండ్రులు మ్యాచ్‌ను అడ్డుకున్నారు. స్టేడియంలో బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న రాప్తా డు సీఐ శ్రీహర్ష అక్కడకు చేరుకుని బాధిత క్రీడాకారుల తల్లిదండ్రులతోనూ, జిల్లా క్రికెట్ సంఘం సభ్యులతోనూ చర్చించి సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. సెలెక్షన్ కమిటీ, జిల్లా క్రికెట్ సంఘం పరప తి ఉన్న, డబ్బులు ఇచ్చిన వారి పిల్లలనే సెలెక్ట్ చేస్తున్నా రని, ఇందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తల్లిదం డ్రులు మండిపడ్డారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు శని వారం కలెక్టరేట్‌కు వెళ్లగా, అక్కడ ఇన్‌చార్జి కలెక్టర్‌గా ఉన్న జాయింట్ కలెక్టర్ కలవడానికి అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం ప్రాబబుల్స్‌కు 28మందిని ఎంపిక చేయగా, ఇందులో సుమారు 11మంది 12ఏళ్ల వయస్సు పైబడి, స్థానికేతరులు ఉన్నారన్నారు. సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా కమలాకర్‌నాయుడు అనర్హుడని, ఏకపక్షంగా చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి మాట్లాడుతూ... బీసీసీఐ, ఏసీఏ నిబంధనల మేరకే జిల్లా అండర్-12 బాలుర జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని, ఇందులో ఎటువంటి అపోహలకు తావులేదన్నారు. అర్హులకే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. అర్హులైన క్రీడాకారులకు న్యాయం చేస్తామన్నారు.

టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ బాల, బాలికల టెన్నీకాయిట్ జట్లను ఎంపిక చేశారు. ఎంపిక పోటీలను ఆదివారం స్థాని క ప్రభుత్వ న్యూటౌన్ జూనియర్ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించారు. జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు రజాక్, ప్రధాన కార్యదర్శి రంగస్వామి వివరాలను ప్రకటించారు. జనవరి 11, 12వ తేదీలలో శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థా యి జూనియర్ పోటీలకు బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలిక ల్లో జ్యోతిక, సుప్రియ, పూజా, ఐశ్వర్య ఎంపిక కాగా, బాలురలో మహీధర్, చిన్నికృష్ణ, యశ్వంత్‌సాయి బాలాజీ, సాయిచరణ్ ఎంపికయ్యారు. ఫిబ్రవరి నెలలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ పోటీలకు బాలికల విభాగంలో జ్యోతిక, సుప్రియ, స్పందన, కావేరి ఎంపిక కాగా, బాలురలో మహీధర్, చిన్నికృష్ణ, సుధీకర్, వంశీ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నీకాయిట్ అసోసి యేషన్ కోశాధికారి వలి, పీడీలు అమరా రామాంజనేయులు, పవన్‌కుమార్, క్రీడాకా రులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సిద్ధి గణపతి మహాయాగం



మహాయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో రోడ్డులోని శ్రీజ్ఞానపీఠం ఆవరణలో శనివారం నుంచి నిర్వహిస్తున్న సిద్ధి గణపతి మహాయాగం శస్త్రోక్తంగా ముగిసింది. శ్రీజ్ఞానపీఠం, గుహానంద మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక యాగాల్లో భాగంగా ఈ యాగం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పీఠం ఆవరణలో ఆదివారం అష్టద్రవ్యాలతో గణపతి మూలమంత్ర హోమం, వాంఛా కల్పలత విద్యాగణపతి హోమం నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి వేశారు. మధ్యాహ్నం పీఠం వెలుపల భారీగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో విద్యానందనాథస్వామి, గోటేటి శ్రీనివాసరావు, లక్ష్మి, మధుసూదన్‌రావు, పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని వినతి

అనంతపురం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రి, మెడికల్ కాలేజ్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతన బకాయిలు ఇప్పించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఏఐటీయూసీ నాయకులు కృష్ణుడు, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు ఆదివారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఆదివారం సాయంత్రం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించా రు. ఎన్నికల అధికారిగా శాప్ రిటైర్డు డీడీ నాగరాజు, ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చక్రవర్తి, డీఎస్ఏ కోచ్ అనిల్‌కుమార్, టేబుల్‌టెన్నీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా హైకోర్టు జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి, చైర్మన్‌గా తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ప్యాట్రన్‌గా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా నరేంద్ర చౌదరి, కోశాధికారిగా హబీబుల్లా, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, నాగరాజు, రామ్‌కుమార్, బుగ్గయ్యచౌదరి, మురళీకృష్ణ, సుధాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా బాల రామారావు, వెంకటేశ్, జయచంద్రారెడ్డి, కార్యవర్గస భ్యులుగా చంద్రశేఖర్, నరసారెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, అర్షాద్, మహేష్, మనోజ్, సంతోష్, గోపాల్‌రెడ్డి, వసీంఅక్రమ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏపీ స్టూడెంట్ జేఏసీ అధ్యక్షుడిగా మధుసూదన్

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టూడెంట్ జేఏసీ ఎస్కేయూ అధ్యక్షులు మధుసూదన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం అధ్యక్షులు హేమాద్రి, జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు.

కురుబ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎంపిక

అనంతపురం విద్య, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా కురుబ ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గం ఎంపిక చేశారు. పెనుకొండలో ఆదివారం ఆ సంఘం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కురుబ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. యూనియన్ కొత్త క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తర్వాత ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షురాలిగా వ్యవసాయశాఖకు చెందిన ఆర్వేటి పద్మావతిని, ప్రధాన కార్యదర్శిగా విద్యాశాఖకు చెందిన మంగళకుంట నాగరాజును ఎంపిక చేశారు. కొత్తగా ఎంపికైన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులను బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఇతర నాయకులు, సభ్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

మహిళ అదృశ్యంపై కేసు

నార్పల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేం ద్రంలోని తిక్కస్వామి వీధికి చెందిన బలిజ మధు మతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్ఐ సాగర్ తెలిపారు. తన భార్య మధుమతి శనివారం ఇంటి నుంచి వెళ్లిందని, బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించలేదని ఆమె భర్త చిలమకూరి రమేష్ ఫిర్యాదు చేశాడన్నారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా..

ఎఫ్‌సీఐ గోదాములను వినియోగించుకోవాలి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎఫ్‌సీఐ గోదాములను సివిల్ సప్లై అధికారులు వినియోగించుకోవాలని భారత ఆహార భద్రతమండలి రాష్ట్రకన్సలేటివ్ కమిటీ డైరెక్టర్ ఆనగొంది విజయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలో స్వగృహంలో ఆమె ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో తిమ్మనచెర్లలో ఎఫ్‌సీఐ గోదాములో రెండు వేల మేట్రిక్ టన్నుల బియ్యం నిల్వ ఉందన్నారు. ఇటీవల ఆ గోదామును పరిశీలించి, అక్కడ జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇందుకు మంత్రి స్పందించి ఎఫ్‌సీఐ గోదాములను సివిల్ సప్లై అధికారులు వినియోగించుకోవటం లేదని తనకు లేఖ పంపించారన్నారు. ఆ లేఖను తాను రాష్ట్ర పౌరసరఫర శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పంపించినట్లు చెప్పారు. ఈనెల 23 మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గోదాములను వాడుకోవాలని, ప్రైవేట్ గోదాములను నిర్వహించరాదని అన్ని డివిజన్ అధికారులకు ఆదేశించారన్నారు. ఎఫ్‌సీఐ గోదాములకు పూర్వవైభవం తీసుకురావాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఆమె సూచించారు. అంగన్‌వాడీసెంటర్, మధ్యాహ్నభోజనపథకం, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్‌కు అందుతున్న బియ్యం, రేషన్ షాపులలో పంపిణీ చేస్తున్న సరుకుల పంపిణీలో నెలకొన్న సమస్యలను ప్రజలు తన దృష్టికి తెస్తే తాను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

పేదల పక్షాన సీపీఐ పోరాటం


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గుత్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన సీపీఐ పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డీ జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం వారు నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గాంధీ సర్కిల్, రాజీవ్ సర్కిల్ మీదుగా పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎర్రజెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులు, కర్షకులకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. ప్రజలు, రైతులు, కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసే ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయకార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి రామదాసు, పట్టణ కార్యదర్శి రాజుయాదవ్, నాయకులు మధుసూదన్‌రావు, నజీర్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాముడాయల్, రామాంజనేయులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భక్త కనకదాస జయంతి


కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కుందుర్పి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి గ్రామంలో ఆదివారం భక్తకనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కురుబలు కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురవయ్యలచే నృత్యాలు, పాలు పోసే కార్యక్రమం నిర్వహించారు. కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు కామక్కపల్లి నాగరాజు, బ్రహ్మసముద్రం, కుందుర్పి మండలాల అధ్యక్షులు నాగరాజు, రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు యాటకల్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప గ్రామోత్సవం

శెట్టూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లిలో ఆదివారం అయ్యప్ప మాలధారులు స్థానిక మారెమ్మ ఆలయం వద్ద అయ్యప్ప స్వామి మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పూజలు జరిపారు. అనంతరం స్వామి చిత్రపటాన్ని మేళతాళాలతో పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా మాలధారులు భజనలు చేశారు.

దివ్యాంగులకు తోడ్పాటు అందించాలి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవసరమైన తోడ్పాటు అందిస్తే విజయం సాధిస్తారని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో పోలేరమ్మ ఆలయం వద్ద వికలాంగుల కమిటీ అధ్యక్షుడు దొడ్డప్ప అధ్యక్షతన ఆదివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వన్‌టౌన్ సీఐ మనోహర్, ఎంపీఐ రాజాబాబు హాజరై మాట్లాడారు. వికలాంగులను ఎవరైనా చులకనగా చూస్తే సెక్షన్ 92ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు. దొడ్డప్ప నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అమోఘమన్నారు. అనంతరం దివ్యాంగులకు ప్లేటు, గ్లాసులు పంపిణీ చేసి అన్నదానం చేపట్టారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, ఎస్ఐలు కొండయ్య, రాఘవేంద్రప్ప, వెంకటస్వామి, సమాజ సేవకులు చిట్టిబాబు, మల్లికార్జున, షేక్షావలి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-బళ్లారి రైలు మార్గంలోని బేవనహల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం 50 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుంతకల్లుప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని, విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రమాదంలో గాయపడిన కార్మికుడి మృతి


మృతి చెందిన వివేకానందరెడ్డి

బల్లికురవ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వీర్ల గంగమ్మ కొండ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన గ్రానైట్ కార్మికుడు వివేకానందరెడ్డి (29) ఆదివారం తెల్లవారుజామున ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన వివేకానందరెడ్డి బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీలో క్రేన్ ఆపరేటర్‌గా ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. క్వారీలో పనిచేసే ముఠా మేస్త్రీ వెంకటేష్‌తో కలిసి బల్లికురవ వెళ్లి తిరిగి బైకుపై వస్తుండగా ఆగి ఉన్న గ్రానైట్ లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో బైకు నడపుతున్న తమిళనాడుకు చెందిన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన వివేకానందరెడ్డిని వెంటనే తోటి కార్మికులు చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వివేకానందరెడ్డి మృతి చెందాడు. ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివేకానందరెడ్డి మృతదేహాన్ని తండ్రి కృష్ణారెడ్డికి అప్పగించారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

దుమ్ము కొట్టుకుపోతున్న అరటి


రోడ్డు పనులతో అరటిపంటపై చేరిన దుమ్ము


దుమ్ము పడకుండా గెలలకు పట్టలు కట్టిన దృశ్యం

- రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ అలసత్వం
- సమీపంలోని అరటి పంటలపై పడుతున్న దుమ్ము
- పంటలు నాశనమవుతున్నాయని రైతుల ఆవేదన

యాడికి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తాము ఎంతో కష్టపడి సాగుచేసిన అరటిపంట నష్టపోవాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రాయల చెరువు నుంచి దైవాలమడుగు వరకు సుమారు 6కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ అలసత్వంతో రైతులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టి పనులు చేపడుతున్న సమయంలో దుమ్ము ఎగసిపడకుండా నీటిని కొట్టించాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా దుమ్మూ ధూళితో సమీపంలోని అరటి పంటలు నాశనం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళితే ఏమాత్రం లెక్కచేయడం లేదని వాపోతున్నారు. దీంతో రూ. లక్షలు వెచ్చించి సాగుచేసిన అరటిపంటలను నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులతో వచ్చే ఎర్రటి దుమ్మూ ధూళి అరటి గెలలపైన, ఆకులపైన పడి దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయని రైతులు తెలుపుతున్నారు. దుమ్మూధూళితో కూడిన దిగుబడిని కొనడానికి వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదని అంటున్నారు. కేవలం కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తాము ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయని వారు మండిపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించి సం బంధిత కాంట్రాక్టర్‌కు దిశానిర్దేశం చేయాలని కోరుతున్నారు. అభివృద్ధి ప నులకు తాము అడ్డంకి కాదని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అరటి నష్టపోయి కడుపు మండి తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నామని రైతులు తెలపడం గమనార్హం.

దుమ్ముధూళితో అరటిపై తీవ్ర ప్రభావం



రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో దుమ్మూధూళి అరటిపై పడి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. దీనిపై కాంట్రాక్టర్‌కు తెలిపితే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. మట్టిపై నీళ్లు పట్టాల్సింది పోయి ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అరటి పంటను నష్టపోవాల్సి వస్తోంది.

-శ్రీధర్, రైతు, రాయలచెరువు

ఎనిమిదెకరాల్లో పంట నష్టం



ఎనిమిది ఎకరాల్లో అరటి సాగు చేశాను. రోడ్డు నిర్మాణ పనుల నుంచి ఎగిసి పడుతున్న దుమ్మూధూళితో పంటను పూర్తిగా నష్టపోవాల్సి వస్తోంది. దుమ్మూ ధూళి పడకుండా అరటి గెలలపై సంచులు కప్పినా కూడా దుమ్ముప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దుమ్ము పడిన అరటి దిగుబడిని కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతోంది.

-మహబూబ్‌పీరా, రాయలచెరువు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం



రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలి. నిర్మాణ పనులతో పంట నష్టపోతున్న రైతుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకోవాలి. మట్టి పనులు చేస్తున్న సమయంలో నీటిని పట్టకపోవడంతోనే దుమ్ముధూళి అరటిపంటపై పడుతోంది. దీంతో దిగుబడిని నష్టపోవాల్సి వస్తోంది. పంటలను నష్టపోయి రైతుల కడుపులు కాలితే రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకోవడం ఖాయం. కేవలం కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే అరటి రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

- జగదీష్, రాయలచెరువు

కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయించండి

●ఎమ్మెల్యే అమిలినేనికి కురుబ సంఘం నాయకుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కురుబ సంఘం నాయకులు

కళ్యాణదుర్గం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కురుబల కల్యాణ మంటపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేలా కృషి చేయాలని కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నీలాస్వామి, కురుబ సంఘం నాయకులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఆదివారం వారు ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... గత వైసీపీ హయాంలోనే కల్యాణమండపం నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, కాని ఆ నిధులన్నీ మరుగున పడిపోయాయని తెలిపారు. తిరిగి మళ్లీ ఆ నిధులు మంజూరు చేయించేలా కృషి చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కురుబ సంఘం నాయకులు బోరంపల్లి ఆంజనేయులు, మోహన్, కామక్కపల్లి నాగరాజు, ఎల్ఐసీ రామకృష్ణ తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందచేసిన వారిలో ఉన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లికి చెందిన టీడీపీ నాయకుడు దొణస్వామి అనారోగ్యం కారణంగా ఆపరేషన్ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. టీడీపీ సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, రామాంజినేయులు, కొల్లాపురప్ప తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆవులజాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల గ్రామంలో ఆదివారం జరిగిన ఆవుల జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. గ్రామస్థులు, యాదవ సోదరులు ఆయనకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఈరన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించారు.

మోసపోయాం.. న్యాయం చేయండి సారూ..

● రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాలవెంకటాపురం రైతుల వేడుకోలు


నోటీసులను చూపుతున్న బాధితులు

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీలు చెల్లిస్తామని నమ్మబలికి డబ్బులు తీసుకుని ఆ పైన నట్టేట ముంచారని, మమ్మల్ని ఆదుకోవాలని మండలంలోని బాలవెంకటాపురం గ్రామానికి చెందిన రైతులు కోరారు. మోసగించిన వారిపై ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఇమాంవలి, ఖాసీం వలి అనే అన్నదమ్ములు అధిక వడ్డీలు చెల్లిస్తామని నమ్మబలికి తమ వద్ద నుంచి రూ. ఐదు కోట్ల మేర అప్పు తీసుకున్నారన్నారు. ఆ డబ్బుతో ఆస్తులు, బంగారం, భవనాలు కొన్నారన్నారు. ఆ తర్వాత తమకు డబ్బు చెల్లించకుండా ఐపీ నోటీసులు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆస్తులను జప్తు చేసి తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. మూడు రోజుల క్రితం ఎస్పీ జగదీష్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

విజయవంతం చేయండి

గుత్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోం మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం వారు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పెద్దఎత్తున చేపట్టే ఈ నిరసన కార్యక్రమానికి ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, బీఎస్పీ నాయకుడు విజయ్, మాలమహానాడుసంఘం జిల్లానాయకులు రామాంజనేయులు, మండల కార్యదర్శి మల్లికార్జున, సీపీఎం నాయకుడు రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరుచింతల గ్రామపొలాల్లో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.48వేల నగదును స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ ధరణీబాబు, సిబ్బందితో కలిసి పేకాటస్థావరంపై దాడిచేశామన్నారు. పేకాటాయుళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని బొమ్మగానిపల్లి వంక తండాలో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రకుమార్ తెలిపారు. సమాచారాన్ని తెలుసుకుని సిబ్బందితో దాడులు చేసి వారిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ. 3720ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

తాడిపత్రి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీబస్టాండ్, పాతబస్టాండ్, పప్పూరురోడ్డు, రైల్వేస్టేషన్, ఆలయాల వద్ద యాచకులకు ఆదివారం తెల్లవారుజామున ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 40దుప్పట్లను పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు. 12ఏళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో చలికాలంలో దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సభ్యులు పాల్గొన్నారు.

తగ్గిన టమోటా ధరలు

అనంతపురం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు భారీగా తగ్గి పోయాయి. కొన్నిరోజులుగా టమోటా ధరలు తగ్గుతున్నాయి. స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో గరిష్ఠ ధర రూ. 10 నుంచి రూ. 15మధ్య పలికింది. ఆదివారం మరింత తగ్గి, గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 2250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.6, కనిష్ఠ ధర రూ.4 పలికినట్లు తెలిపారు.

యాచకుడికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ఆ నలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ.. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో 60 ఏళ్ల యాచకుడు మృతిచెందాడని, ఈ విషయాన్ని వన్‌టౌన్ పోలీసులు తమకు సమాచారం అందించారని అన్నారు. పాతగుంతకల్లులోని హిందూశశ్మాన వాటికలో వృద్ధుడి అంత్యక్రియలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆ సమితి సభ్యులు వడ్డె కృష్ణమూర్తి, ఆటోవేణు, శీన, రాజప్ప, రవీంద్ర, ప్రవీణ్, అంజలి, స్నేహ, నవీన్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపకపోతే ఆందోళన

బెళుగుప్ప, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనాదిగా కొనసాగుతున్న సంతలను జాతీయ ఏకీకృత మార్కెట్ విధానం పేరుతో ప్రై వేటీకరణ చేసే కార్యక్రమాన్ని ఆపేయాలంటూ ఏపీ రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి హనుమంతరాయుడు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. వాటిని కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలన్నారు. ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయరాదన్నారు. కేంద్రం ప్రైవేటీకరణను ఆపకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఎంపీడీఓపై దాడిచేసిన వారిని శిక్షించాలి

● ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

గుంతకల్లుటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుపై వైసీపీ నాయకుల దాడి హేయమని, దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేష్, ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నాయకులకు చట్టాలపట్ల, దళితులపట్ల గౌరవం లేదన్నారు. ఈ దాడిపై మాజీ సీఎం జగన్ స్పందించాలన్నారు. కూటమిప్రభుత్వం దళితులకు, దళిత ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, రాజు, రఘు, మహేష్, శ్రీనివాస్, కిరణ్, పోలాసుకుమార్, పాండు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యథేచ్ఛగా కర్ణాటక మద్యం విక్రయాలు

● చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

బొమ్మనహాళ్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చినా కర్ణాటక మద్యం రవాణా, విక్రయాలు మాత్రం ఆగడం లేదు. మండలంలోని పలుచోట్ల కర్ణాటక మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గోవిందవాడ, ఉద్దేహాళ్, బొల్లనగుడ్డం, దర్గాహోన్నూరు తదితర గ్రామాలలో టెట్రాప్యాకెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గోవిందవాడ, ఉద్దేహాళ్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల వద్ద మద్యం తాగి ఖాళీ ప్యాకెట్లను అక్కడే పడేస్తున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. రంగాపురంక్యాంపు అంజనేయ స్వామి ఆలయం ఎదుట సైతం ఖాళీ మద్యం ప్యాకెట్లను పడేస్తున్నారు. బొమ్మనహాళ్ మండలం బళ్లారి సరిహద్దులో ఉండడంతో కొందరు టెట్రాప్యాకెట్లు జోరుగా తరలిస్తూ అక్రమ సంపాదనకు తెరలేపారు. ఉన్నతాధికారులు చొరవచూపి సమస్యను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై కణేకల్లు ఎక్సైజ్ సీఐ ఉమాబాయిని వివరణ కోరగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు వారి పేర్లతో సహా తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోమటికుంట్ల చెరువుకు హెచ్చెల్సీ నీరు


చెరువుకు వెళుతున్న హెచ్చెల్సీ నీరు

పుట్లూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లూరు చెరువు నుంచి కోమటికుంట్ల చెరువుకు హెచ్చెల్సీ నీరు చేరుతోంది. రెండు రోజుల క్రితం అధికారులు నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో చెరువుకు నీరు చేరుతోంది. గతేడాది చెరువుకు నీరు లేక గ్రామంలోని బోర్లు ఎండిపోయాయి. దీంతో తాగునీటిని సైతం ఇతర గ్రామాల నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు. చెరువుకు నీరు చేరుతుండడంతో బోర్లలో నీటిమట్టం పెరిగి తాగునీటి సమస్య ఉండదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వ్యవసాయబోర్లలో కూడా నీరు సమృద్ధి గా వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఇచ్చిన ఎన్నికల హామీ నెరవేర్చారని ఆ గ్రామ టీడీపీ నాయకుడు కులశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుంతకల్లుటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బళ్లారి రోడ్డులో గల కల్వరి చర్చి వద్ద ఆదివారం అక్రమంగా తరలుతున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా హగరిబొమ్మనహళ్లి గ్రామానికి చెందిన రామన్న అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో మద్యాన్ని గుంతకల్లుకు తరలిస్తుండగా సమాచారం అందిందని, దీంతో వెంటనే దాడులు నిర్వహించి పది బాక్సుల టెట్రా ప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. అనంతరం రామన్నపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎస్ఐ వెంకటేశం, సిబ్బంది ధనంజయ, కేశవయ్య, బాబ్జీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్ బోల్తా


బోల్తా పడిన వరిగడ్డి ట్రాక్టర్

బొమ్మనహాళ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరిగడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఆదివారం బోల్తా పడిన ఘటన మండలంలో ఎల్‌బీనగర్ గ్రామం వద్ద ఆదివా రం చోటు చేసుకుంది. ట్రాక్టర్‌లో వరిగడ్డిని లోడు చేసుకుని కణేకల్లు క్రాస్ వైపు వెళుతుండగా.. ఎల్‌బీనగర్ గ్రామంలో వేద్రిడ్జి వద్ద ఐషర్ వాహనం ఎదురుగా వచ్చి తగిలింది. దీంతో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు అన్నారు. డ్రైవర్ కూడా సురక్షితంగా బయటపడ్డాడన్నారు. ట్రాక్టర్లలో భారీగా గడ్డిని లోడు చేసుకుని రోడ్డు మధ్యలో వస్తున్నారని, దీంతో సైడ్లకు ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉందని, ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

గుత్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఆదివారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీసభ్యుడు రమేష్ ఎస్ఎఫ్ఐ జెండాను ఎగుర వేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ చేపట్టిన వివిధ పోరాటాలు, త్యాగాల గురించి వివరించారు. నాయకులు నవీన్ యాదవ్, షెక్షావలి, రాజు, వాసు, రాహుల్, మురళి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


పూర్వవిద్యార్థులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం 1980-83 విద్యా సంవత్సరంలో బీఎస్సీ, బీజెడ్ డిగ్రీ చదువుకున్న విద్యార్థులు పూర్వసమేళ్మన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వవిద్యార్థులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నేమరవేసుకున్నారు. కళాశాల అభివృద్ధికి పాటుపడుతామని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మమయ్య, పూర్వవిద్యార్థులు గౌరీశంకర్, వేణుగోపాల్, శ్రీనివాసులు, మహబుబ్‌బాషా, షెక్షావలి, సుంకన్న, మనోహర్, గోవిందరావు, నాగమ్మ, విజయలక్ష్మి, సుచితాకుమారి పాల్గొన్నారు.